ఇన్ని పథకాలు ఏనాడైనా చూశారా?

- టీడీపీ, వైఎస్సార్ సీపీ పాలనలో తేడాను గుర్తించండి
- పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం
- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ఎన్పీకుంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను చేరవేస్తోందని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎన్.పీ.కుంట–1 సచివాలయం పరిధిలోని కలంగడివీధి, బక్కిరెడ్డి బజారు, ఈడిగబజారు, ట్యాంకిబజారు, చాకలి బజారు, సరస్వతి కాలనీలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్సీపీ పాలన మధ్య తేడాను వివరించారు. కలంగడివీధి, సరస్వతి కాలనీల్లో సీసీరోడ్డు వేయించాలని స్థానికులు కోరారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వంలో అయినా చూశారా? అని ప్రశ్నించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారని, కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు.

టీడీపీ పాలనలో అభివృద్ధి శూన్యం:

టీడీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాలకు సరైన రహదారి సౌకర్యంలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వైఎస్సార్సీపీ అధికారం చేపట్టిన తరువాత మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పించామని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పీహెచ్సీని సందర్శించి సమస్యలపై వైద్యాధికారితో ఆరా తీశారు. మండల కేంద్రానికి పాత 108 వాహనం పంపించారని, ఐదు రోజుల క్రితం ఈ వాహనం రోడ్డు ప్రమాదానికి గురైందని వైద్య సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే డీఎంఅండ్ హెచ్ఓతో ఫోన్లో మాట్లాడారు. నూతన 108 వాహనాన్ని పంపించాలని కోరారు. ఎంపీపీ ఈటి రాము, వైస్ఎంపీపీ కేశవరెడ్డి, బీసీనేత బాలకృష్ణ నాయుడు, సర్పంచ్ ఆంజినమ్మ, ఎంపీటీసీలు మగ్బూల్బీ, తిమ్మారెడ్డి, కొత్తరంగారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, సర్పంచులు నాగమునీశ్వరనాయుడు, రామాంజుల రెడ్డి, విష్ణుమూర్తి, జేసీఎస్ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓఆర్డీ మనోహర్, వాటర్షెడ్ చైర్మన్లు బయారెడ్డి, ఓబుళరెడ్డి, గ్రామకన్వీనర్ వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, తిరుమలనాయుడు, గోవిందునాయక్, ఈశ్వర్నాయక్, శ్రీరాములు, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రాఘవయ్య, స్కూల్ కమిటీ చైర్మన్లు భాస్కర్, సుహేల్ఖాన్ పాల్గొన్నారు.

రేపు కుమ్మరవాండ్లపల్లిలో గడప గడపకూ

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి సచివాలయం 1,2 పరిధిలో సోమవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ ప్రకాష్ తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి

కదిరి టౌన్: రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 13న స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. అంతకుముందు న్యాయవాదులు, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు సహకరించాలన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్రెడ్డి పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కనగానపల్లి: స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. శనివారం కనగానపల్లిలోని గ్రంథాలయ కార్యాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. 35 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు రామకృష్ణ, రామ్మోహన్, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు



పట్టుబడిన కర్ణాటక మద్యం ప్యాకెట్లు, వ్యక్తితో కనగానపల్లి పోలీసులు

కనగానపల్లి: గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తగరకుంటలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న అశోక్కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 38 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

180 మందికి కంటి పరీక్షలు

రామగిరి: స్థానిక జెడ్పీహెచ్ఎస్లో శాంతిరామ్ సూపర్స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సర్పంచ్ మీనుగ నాగరాజు శనివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. 180 మంది కంటిపరీక్షలు చేయించుకోగా, వారిలో 15 మంది శస్త్రచికిత్సలకు ఎంపికైనట్లు సిబ్బంది తెలిపారు. ఓబిరెడ్డి, జయచంద్రారెడ్డి, నాగమ్మ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



చింతా రామచంద్రారెడ్డిని పరామర్శిస్తున్న కడపల మోహన్రెడ్డి

ఓడీ చెరువు: కాలు విరిగి చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న మండల పరిధిలోని మామిళ్లకుంట్లపల్లికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు చింతా రామచంద్రారెడ్డిని శనివారం వైఎస్సార్సీపీ సీఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కడపల మోహన్రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత

తనకల్లు: స్థానిక దళితవాడకు చెందిన గొంది గణపతి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్సీపీ నాయకుడు పాలెం సుధాకర్ మృతుని కుటుంబానికి శనివారం రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు.

చిన్నపల్లిలో కార్డన్సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ చిన్నగౌస్

చెన్నేకొత్తపల్లి: చిన్నపల్లి గ్రామంలో శనివారం తెల్లవారుజామున రామగిరి సీఐ చిన్నగౌస్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్ హంట్ పోస్టర్ల విడుదల

కదిరి అర్బన్: పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్లో చేరేందుకు అనంతపురం జిల్లాలో ఎస్ఆర్ఐ కళాశాల యాజమాన్యం ఈనెల 14న టాలెంట్ హంట్ –2023 పేరుతో పోటీపరీక్ష నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆవిష్కరించారు. కళాశాల ఎండీ చంటిరెడ్డి మాట్లాడుతూ వివరాలకు 9494472722, 9652380088 సెల్నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడిగా షేక్ రఫీ ఎన్నిక



కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన రఫీని అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడిగా పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన షేక్ రఫీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్మన్ తుంగా ఓబులపతి అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో రూ.90 లక్షలతో చేపట్టనున్న 17 అభివృద్ధి పనులను కమిషనర్ వెంకట్రామిరెడ్డి చదివి వినిపించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం తోపాటు, ఆయా వార్డు ప్రజల నుంచి అందిన విన్నపాల మేరకు సీసీ రోడ్డు, డ్రైన్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం కో ఆప్షన్ సభ్యుడు ఆదాం మృతితో ఖాళీ ఏర్పడిన స్థానానికి ఎన్నిక నిర్వహించారు. 4వార్డుకు చెందిన వైఎస్సార్సీపీ కౌన్సిలర్ చెరువు భాస్కర్ రెడ్డి పట్టణానికి చెందిన మైనార్టీ వర్గానికి చెందిన షేక్ రఫీ పేరును ప్రతిపాదించగా, 5 వార్డు కౌన్సిలర్ సూర్యాగౌడ్ బలపరిచాడు. పాలకమండలి సభ్యులు ఆమోదం తెలపడంతో షేక్ రఫీని కో ఆప్షన్ సభ్యుడిగా కమిషనర్ ప్రకటించారు. వైస్ చైర్మన్లు మరుట్ల శ్రీలక్ష్మి, మాతంగి తిప్పన్న, కౌన్సిలర్లు సాయిగీత, పరుశురాం నాయక్, ఈశ్వరమ్మ, అనిత, పవన్ కుమార్, అగరబత్తుల నాగరాజు పాల్గొన్నారు.

విష జ్వరాలపై జాగ్రత్త

కనగానపల్లి: విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కనగానపల్లి, గుంతపల్లి గ్రామాల్లో పీహెచ్సీ డాక్టర్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

కొత్తచెరువు: విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సచివాలయ ఉద్యోగులకు ఇన్చార్జ్ ఎంపీడీఓ పోలప్ప సూచించారు. కొత్తచెరువులోని పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆయన నాలుగు సచివాలయాల సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కాగా కొత్తచెరువు మేజర్ పంచాయతీ ఈఓ గోపాల్ సెలవుపై వెళ్లడంతో తలమర్ల కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి ఇన్చార్జ్గా నియమించారు.

పీసీఎంఆర్ విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని రూపారాజా పీసీఎంఆర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. 172 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 95శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

యశోద పాఠశాల ...

పది ఫలితాల్లో పట్టణంలోని యశోద కాన్సెప్ట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపల్ అనూప్కుమార్ తెలిపారు. 156 మంది పరీక్ష రాయగా 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

చెస్, టేబుల్ టెన్నిస్ శిక్షణ శిబిరం ప్రారంభం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కళాజ్యోతిలో ఏర్పాటు చేసిన చెస్, టేబుల్ టెన్నిస్ శిక్షణ శిబిరాన్ని రూరల్ సీఐ మన్సూరుద్దీన్ ప్రారంభించారు. ఉచితంగా ఇచ్చే శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాజ్యోతి డైరెక్టర్ రామకృష్ణ, జగ్గా వేణుగోపాల్, జిల్లా పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్, చెస్ శిక్షకులు శివకృష్ణ, నాగేంద్ర, శివ, రఘునాథ్ పాల్గొన్నారు.

13 నుంచి శిక్షణ తరగతులు

పుట్టపర్తి టౌన్: ఈనెల 13 నుంచి జిల్లాలో మూడు రోజుల పాటు జరగనున్న రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణలో కరపత్రాలకు విడుదల చేశారు. శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి పారిశ్రామికవాడలో నెలకొన్న సమస్యను ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ శాంతాబాయ్ పరిష్కరించారు. రూ. 1.20 లక్షలతో బోరు, మోటారు, పైప్లైన్ ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ పాల్గొన్నారు.

ఘనంగా చిన్నమ్మదేవత మహోత్సవం



నల్లమాడ: పసిబాల చిన్నమ్మ దేవత పెట్టెను మోస్తూ వెళ్తున్న పూజారి

ఓడీ చెరువు: ఓడీ చెరువు మండలం డబురువారిపల్లి పంచాయతీ పరిధిలోని బత్తినవారిపల్లి గ్రామంలో వెలసిన పసిబాల చిన్నమ్మ పెట్టె (ఎలువ గంప) మహోత్సవాన్ని శనివారం గ్రామప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నమ్మ ఇంటి వారసులైన ఓబుళప్ప, చెన్నప్ప, కేశవ, శివయ్య, గుర్రం చిన్నప్ప కుటుంబీకులు చిన్నమ్మ వెండి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ఎలువగంపలో ఉంచి ఊరేగించారు. అనంతరం చిన్నమ్మ దేవతను అత్తగారి ఇంటికి (నల్లమాడ మండలం వంకరకుంట)కు తరలివెళ్లారు.

నల్లమాడ: మహిమాన్వితురాలు పసిబాల చిన్నమ్మ స్వామి మూల విరాట్ పెట్టెను ఉరుము వాయిద్యాలతో నల్లమాడ మీదుగా కాలినడకన పూజారులు ఊరేగింపుగా బసిరెడ్డిపల్లికి తీసుకెళ్లారు. మార్గమధ్యంలోని గ్రామాల్లో భక్తులు అమ్మవారికి కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్డీటీ సెట్కు దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట: 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 10లోగా ఆర్డీటీ సెట్కు దరఖాస్తు చేసుకోవాలని ఏటీఎల్ క్రిష్ణా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్ సిలబస్ 500 మార్కులు, సీబీఎస్ఈ నుంచి 420 మార్కులు సాధించినవారు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్గా చదివిన వారు, ఆర్డీటీలో స్పాన్సర్ ఉన్న బీసీ వర్గాల వారితో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఓసీ, బీసీ స్పాన్సర్ లేనివారు సైతం చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుకు ఆన్లైన్లో పొందిన మార్కుల లిస్టు, 10 వతరగతి హాల్టికెట్, ఆధార్, రేషన్కార్డు, 2 పాస్ఫోటోలు జతపరచాలని తెలిపారు. ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో దరఖాస్తు చేయాలని, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

వేసవి శిబిరాన్ని వినియోగించుకోండి



ముదిగుబ్బ: పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

ముదిగుబ్బ: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్లను తహసీల్దార్ నాగేంద్ర, గ్రంథాలయ అధికారి బొజ్జేనాయక్ శనివారం విడుదల చేశారు. 8వ తేది నుంచి 11వ తేదీ వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. స్పోకన్ ఇంగ్లిష్, పుస్తక పఠనం, ఇండోర్ గేమ్స్, డ్యాన్స్, మ్యూజిక్ అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాడిమర్రి: శనివారం స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయ అధికారి శీనా నాయక్ శనివారం ప్రారంభించారు.

గాండ్లపెంట: వేసవి శిబిరం పోస్టర్లను శనివారం గ్రంథాలయాధికారి ఫరియాబాను విడుదల చేశారు.

ధర్మవరం రూరల్: వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్లను జగజ్జీవన్రావ్ నగర్లోని గ్రంథాలయ శాఖ అధికారిణి అంజలి సౌభాగ్యవతి విడుదల చేశారు.

చెన్నేకొత్తపల్లి: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కృష్ణయ్య శనివారం తెలిపారు.

రామగిరి: మండల కేంద్రమైన గ్రంథాలయంలో వేసవి క్యాంప్ను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వెంకటేష్ శనివారం తెలిపారు.

మెకానిక్కు అండ



సుబ్బుకు ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పట్టణానికి చెందిన మొబైల్ మెకానిక్ సుబ్బుకు మొబైల్ అసోసియేషన్ సభ్యులు శనివారం రూ.1.20 లక్షలు ఆర్థికసాయం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, సోము, మహేష్, శివారెడ్డి, అజ్జు, నవీన్, సిద్దు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు

కదిరి టౌన్: పట్టణంలోని 10వ వార్డులో నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభమైంది. అధికారులు వాహనం సమకూర్చడంతో కౌన్సిలర్ దిల్షాదున్నీషా, పట్టణ అధ్యక్షుడు కె.ఎస్.బహుద్దీన్ ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేశారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతులనాగేపల్లి గ్రామానికి చెందిన ఉప్పర సుబ్బయ్య, కల్పన దంపతుల కుమారుడు దినేష్కుమార్ శనివారం పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయినట్లు తెలియడంతో ఇంట్లో వాస్మాయిల్ తాగాడు. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది.

13న పాటల పోటీలు

తనకల్లు: దేవళంతండా వద్ద అభయాంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో ఈ నెల 13వ తేదిన పాటల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ రెడ్డెప్ప శనివారం తెలిపారు. వివరాలకు 9014502987 సెల్ నంబర్లో సంప్రదించాలన్నారు.

వేదమంత్రాల నడుమ దేవతా ఉద్వాసన



దేవతా ఉద్వాసన పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దేవతా ఉద్వాసనను వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పూలతో అలంకరించి దేవతా ఉద్వాసన పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చింతమాను గంగమ్మ ఉత్సవాలు ప్రారంభం



గాండ్లపెంట: మలమీదపల్లి పంచాయతీ కోటూరులో చింతమాను గంగమ్మ ఉత్సవాలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. సర్పంచ్ కళావతి ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి బోనాలు, జ్యోతులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత భళా

శనివారం విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటి ఉత్తమ మార్కులు సాధించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నాడు–నేడు కింద సదుపాయాలు కల్పించింది. ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంది. నాణ్యమైన విద్యకు పెద్దపీట వేసింది. దీంతో విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని మంచి ప్రతిభ చూపారు.



బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల

ధర్మవరం రూరల్: బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల పదో తరగతి పరీక్షల్లో 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. 70 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 67 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.

కదిరి మున్సిపల్, రూరల్ పరిధిలో

కదిరి అర్బన్: జెడ్పీ బాలికల హైస్కూల్ 60.52 శాతం, బాయ్స్ హైస్కూల్ 48.97, జెడ్పీహెచ్ఎస్ పట్నం పాఠశాలలో 49 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదేవిధంగా జెడ్పీహెచ్ఎస్ కేఎస్పాళెం 50 శాతం, జెడ్పీహెచ్ఎస్ బ్రాహ్మణపల్లి 50 శాతం, మున్సిపల్ హైస్కూల్ కుటాగుళ్ల 47.7శాతం, మున్సిపల్ హైస్కూల్ కదిరి 59.7శాతం, మున్సిపల్ ఉర్దూ మెయిన్ స్కూల్ 94.28శాతం, కేజీబీవీ కదిరి 78శాతం, కాళసముద్రం సోషల్ వెల్ఫేర్ పాఠశాల 86.6 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల కదిరి 68.75శాతం, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల 84శాతం ఉత్తీర్ణత సాధించింది.

చెన్నేకొత్తపల్లి: పది ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. మేడాపురం ఉన్నత పాఠశాలలో 78 మందికి గాను 55 మంది, కేజీబీవీలో 32 మందికి గాను 24 మంది, ఏపీ మోడల్ స్కూల్లో 80 మందికి గాను 57 మంది, వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో 24 మందికి 15 మంది, కనుముక్కలలో 98 మందికి గాను 56 మంది ఉత్తీర్ణత సాధించారు. నాగసముద్రం ఉన్నత పాఠశాలలో 30 మందికి, 16 మంది, న్యామద్దలలో 43 మందికి గాను 8 మంది పాస్ అయ్యారు. చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో 97 మందికి గాను 20 మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా వెంకటంపల్లిలో 34 మందికి గాను 12 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ కృష్ణమోహన్ తెలిపారు.

60 శాతం ఉత్తీర్ణత

తనకల్లు: పది ఫలితాల్లో మండల వ్యాప్తంగా 60 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ఎంఈఓ లలితమ్మ శనివారం తెలిపారు.

ఎన్పీకుంట: మండల వ్యాప్తంగా 211 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 119 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు.

గాండ్లపెంట: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 313 మంది పరీక్షకు హాజరుకాగా 192 మంది ఉత్తీర్ణత సాధించి 61.34శాతం ఉత్తీర్ణత సాధించారు.

పుట్టపర్తి అర్బన్: మండలంలో ఎనిమిది ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాల, ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. 614 మంది హాజరు కాగా 314మంది(51.14 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వెంకటరమణనాయక్ పేర్కొన్నారు.

నల్లమాడలో 61.78 శాతం ఉత్తీర్ణత

నల్లమాడ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో 61.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి 539 మంది పరీక్షలు రాయగా 61.78 శాతంతో 333 మంది ఉత్తీర్ణత సాధించారు.

ముదిగుబ్బలో

ముదిగుబ్బ: మండల వ్యాప్తంగా 371 మందికిగాను 217 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సుధాకర్ నాయక్ తెలిపారు.

నల్లచెరువు

నల్లచెరువు: మండల వ్యాప్తంగా 336 మందికి గానూ 246 మంది(73.2శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తిరుపాల్ నాయక్ శనివారం తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని ఉత్తమ మార్కులు సాధించి మండల టాపర్గా నిలిచింది.

కనగానపల్లి: మండల వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలలో 41 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు. 8 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 342 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా వారిలో 141 మంది పాసైనట్లు ఆమె తెలిపారు. కనగానపల్లి జెడ్పీహెచ్ఎస్లో 55 మందికి 22 (40 శాతం) మంది, మామిళ్లపల్లిలో 56 మందికి 22 (39.29 శాతం), తగరకుంటలో 72 మందికి 23 మంది (32 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మద్దెలచెరువులో 29 మందికి 16 మంది (55 శాతం), ముత్తువకుంట్లలో 11 మందికి 5 గురు (45.45 శాతం), వేపకుంటలో 10 మందిలో ఒకరు (10 శాతం), కనగానపల్లి మోడల్ స్కూల్లో 70 మందికి 34 మంది (48.5 శాతం), కేజీబీవీలో 39 మందికి 18 (46 శాతం) మంది విద్యార్థులు పాసైనట్లు ఆమె తెలిపారు.

కొత్తచెరువు: కొత్తచెరువు మండలంలో 10వ తరగతి పరీక్షాఫలితాల్లో బాలికలే టాపర్లుగా నిలిచారు. మండల వ్యాప్తంగా 397 మంది పరీక్షలకు హాజరు కాగా 225 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వెంకటరమణ నాయక్ తెలిపారు. కొత్తచెరువు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మండల టాపర్గా నిలిచింది.

అమడగూరు: మండలంలో పదవ తరగతి ఫలితాల్లో 50 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ జాన్రెడ్డెప్ప పేర్కొన్నారు. 8 పాఠశాలల నుంచి మొత్తం 243 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 129 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

రామగిరి: మండలంలో 65.80శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈఓ గోపాల్ తెలిపారు. మండలంలో మొత్తం 424 మంది పేరూరు డ్యాం, ఏపీఆర్ఎస్ (బాలుర), నసనకోట, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి, రామగిరి, ఏపీఆర్ఎస్ (బాలికల) పాఠశాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.